క్లుప్తంగా

కలెక్టర్ ఆదేశాలతో చెత్త తొలగింపు



నాదెండ్ల: కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశాలతో అమీన్‌సాహెబ్‌పాలెం హైలెవల్ వంతెన వెంబడి పేరుకుపోయిన చెత్తను కార్మికులు శనివారం తొలగించారు. హైలెవల్ వంతెన వెంబడి చెత్త పేరుకుపోయింది. ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు అటువైపుగా వెళుతున్న జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అపరిశుభ్ర వాతావరణాన్ని గమనించారు. మండల పరిషత్ అధికారులకు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటీ ఎంపీడీవో తోకల వెంకటేశ్వర్లు దగ్గరుండి కార్మికులతో శుభ్రం చేయించారు. పొక్లెయిన్‌తో చెత్తకుప్పలు డంపింగ్ యార్డుకు తరలించారు. సర్పంచ్ కామినేని లలితానాగేశ్వరరావు పర్యవేక్షించారు.

నిషేధిత గడ్డి మందు స్వాధీనం



నరసరావుపేటరూరల్: అక్రమంగా రవాణా చేస్తున్న నిషేధిత గడ్డి మందు గ్లెసైల్‌ను వ్యవసాయ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో శనివారం వ్యవసాయ అధికారులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో జిల్లా వ్యవసాయ కార్యాలయ ఏడీఏ వి.హనుమంతరావు, వ్యవసాయ అధికారులు ఐ.శాంతి, శ్రీలతలు పాల్గొన్నారు. పల్నాడు ట్రాన్స్‌పోర్ట్ గోడౌన్‌లో నిషేధిత గడ్డి మందు గ్లెసైల్‌ను అధికారులు గుర్తించారు. తొమ్మిది కాటన్ బాక్స్‌లోని రూ.1.47,700 విలువైన 180 లీటర్లను స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన స్టాక్‌ను తదుపరి చర్యలు కోసం నిలుపుదల చేస్తూ ట్రాన్స్‌పోర్ట్ యజమానికి ఆదేశాలు ఇచ్చారు. ప్రభుత్వం నిషేధించిన గ్లెసైల్ గడ్డి మందును జిల్లాలో విక్రయిస్తే సంబంధిత దుకాణంపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏడీఏ హెచ్చరించారు.

పీహెచ్‌సీలను తనిఖీ చేసిన డిప్యూటీ డీఎంహెచ్ఓ

నాదెండ్ల: గణపవరం, నాదెండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పల్నాడు జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రాల్లో వ్యాక్సిన్ నిల్వలు, డీప్ ఫ్రిజ్ నిర్వహణ, ఫార్మసీ, ల్యాబ్ విభాగాలను పరిశీలించారు. జాతీయ వ్యాధి నిరోధక కార్యక్రమాలు పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. తల్లిపిల్లల ఆరోగ్యంపై చర్చించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి ప్రభుత్వ వైద్యులు సమ్మెలో పాల్గొననున్న నేపథ్యంలో ప్రజలకు వైద్య సదుపాయాలు అంతరాయం లేకుండా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ప్రసాద్‌నాయక్, సాయిశ్వేత, సిబ్బంది శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

చిరంజీవికి బాలకృష్ణ క్షమాపణ చెప్పాలి

కాపు యువసేన రాష్ట్ర అధ్యక్షులు కర్ణా

శావల్యాపురం: అసెంబ్లీలో హిందుపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, మెగాస్టార్ చిరంజీవిపై చేసిన అనుచిత వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని, బహిరంగ క్షమాపణ చెప్పాలని కాపు యువసేన రాష్ట్ర అధ్యక్షులు కర్ణా శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మెగాస్టార్ చిరంజీవిని అవమానపరిచేలా మాట్లాడుతుంటే అసెంబ్లీలో ఉన్న జనసేన ఎమ్మెల్యేలు నోరు మెదపకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలకృష్ణ వ్యాఖ్యలను జనసేన ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు ఖండించకపోతే ప్రజలు నిలదీస్తారన్నారు. నాగబాబు మంత్రి పదవి కోసం నోరెత్తకపోవటం బాధాకరమన్నారు.

జీడికర్రల లోడు లారీలకు జరిమానా

యడ్లపాడు: జీడికర్ర లోడుతో అనకాపల్లి నుంచి కాళహస్తి వెళ్తున్న 10 లారీలను గుంటూరు జిల్లా అటవీ శాఖ విజిలెన్స్ అధికారి ఎస్‌వీ సుబ్బారావు శనివారం బోయపాలెం వద్ద నిలిపివేశారు. యడ్లపాడు మండలం బోయపాలెం 16వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం ఆయా వాహనాలు అధికారులు నిలుపుదల చేశారు. రవాణాకు సంబంధించిన పత్రాలను తనిఖీ చేసి వాల్టా చట్టం ప్రకారం పూర్తిస్థాయి అనుమతులు లేకపోవడంతో వాహనాలపై జరిమానా విధించారు. ఒక్కో వాహనానికి రూ.4 నుంచిరూ.6వేల వరకు అపరాధ రుసుం కట్టాలని ఆదేశించారు. అనుమతులు లేని కారణంగానే జరిమానా విధించినట్లు తెలిపారు.



లలిత త్రిపురసుందరి అలంకారంలో పార్వతి అమ్మవారు



గాయత్రీ అలంకారంలో కన్యకా పరమేశ్వరీ అమ్మవారు



సాతులూరు ఆలయంలో మహాచండీదేవిగా



విప్పర్లలో లలిత త్రిపుర సుందరీ అలంకారంలో కామాక్షి

వాత్సల్యరూపిణి.. లలితాత్రిపురసుందరీదేవి



కుంకమపూజలో పాల్గొన్న మహిళలు

శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వివిధ ఆలయాలలో అమ్మవారు పలు అలంకరణలతో భక్తులకు దర్శనమిచ్చి అనుగ్రహిస్తున్నారు. పాలపాడురోడ్డులోని ఆలయంలో అమ్మవారిని పలు రకాల ఆకుకూరలతో అలంకరించారు. కల్యాణ సుందరేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారు శ్రీ లలిత త్రిపురసుందరిగా, శంకరమఠంలో శ్రీ శారదాంబ అమ్మవారు అన్నపూర్ణగా, సత్తెనపల్లిరోడ్డులోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు గాయత్రీ దేవిగా, పాతూరు శివాలయం పార్వతి అమ్మవారు మహంకాళి అలంకారంలో దర్శనమిచ్చారు. ఇస్సపాలెం మహంకాళి అమ్మవారి ఆలయంలో శనివారం నిర్వహించిన కుంకుమపూజలో మహిళలు పాల్గొన్నారు. ఆలయ అర్చకుడు కొత్తలంక కార్తికేయశర్మ, నండూరి కాళీకృష్ణ ఆధ్వర్యంలో పూజాధికాలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈవో ఎన్.మాధవిదేవి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో భారీ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. శావల్యాపురంలోని శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దేవాలయంలో శ్రీలలిత త్రిపుర సుందరిదేవిగా శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారి రావిపాటి సాయి భరత్ అమ్మవారిని అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నీలంపాటి అమ్మవారి దేవాలయంలో ఆలయ ధర్మకర్త మద్దినేని హరిబాబు, కేతేపల్లి వెంకటేశ్వర్లు దంపతులు హోమాలు,



వినుకొండలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

అర్చనలు నిర్వహించారు. మండలంలోని రవ్వవరం గ్రామంలో శ్రీ వెంకటేశ్వర జగన్మాత దేవాలయంలో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం అమ్మవారిని శ్రీలలితాత్రిపుర సుందరిదేవిగా అలంకరించారు. బొల్లాపల్లి మండలం వడ్డెంగుంట గ్రామంలో శ్రీ జ్ఞాన ప్రసూనాంబ కాళహస్తీశ్వరస్వామి దేవాలయంలో శ్రీ జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

–నరసరావుపేట ఈస్ట్/ నరసరావుపేట రూరల్/చిలకలూరిపేట/ నాదెండ్ల/వినుకొండ/శావల్యాపురం/నూజెండ్ల/ బొల్లాపల్లి



శావల్యాపురంలో శ్రీలలిత త్రిపురసుందరిదేవి అలంకారం



చిలకలూరిపేటలో శ్రీకాళికాదేవి అలంకారంలో అమ్మవారు



రవ్వవరంలో లలితాత్రిపురసుందరీదేవిగా..



వడ్డెంగుంటలో లలితా త్రిపుర సుందరిగా జ్ఞాన ప్రసూనాంబ

జీఎస్‌టీ తగ్గింపుతో ప్రతి కుటుంబానికి మేలు

జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎంవీ ప్రసాద్

నరసరావుపేట: జీఎస్‌టీ 2.0 ద్వారా ప్రతి కుటుంబానికి నిత్యావసర వస్తువులపై ఆదా చేసుకునే అవకాశం కలుగుతుందని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎంవీ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం స్థానిక మార్కెట్ సెంటర్‌లోని శ్రీ భావనారాయణ స్వామి దేవస్థానం కల్యాణ మండపంలో జిల్లా పౌరసరఫరాల శాఖ, జీఎస్‌టీ శాఖ, తూనికలు, కొలతల శాఖ, ఆహార భద్రత శాఖ సమన్వయంతో ఏపీ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్, నరసరావుపేట చాంబర్ ఆఫ్ కామర్స్ కలసి సూపర్ జీఎస్‌టీ–సూపర్ సేవింగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపీ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు పిల్లి యజ్ఞనారాయణ, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు వనమా సాంబశివరావు మాట్లాడారు. ఏపీ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, ఉపాధ్యక్షులు కె.కిరణ్‌కుమార్, ఎస్.వెంకటేశ్వర్లు, చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి పి.సతీష్‌కుమార్, వన్ టౌన్ కిరాణా మర్చంట్ అధ్యక్షులు పి.శ్రీనివాసరావు, కార్యదర్శి కె.శ్రీనివాసరావు, టూ టౌన్ కిరాణా మర్చంట్ అధ్యక్షులు డి.విజయ్‌కుమార్, కార్యదర్శి పంతంగి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నూజెండ్ల: జీఎస్టీ సంస్కరణల వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు చేకూరుతుందని జీఎస్టీ ఎగ్జిక్యూటివ్ అధికారి ఎస్.వెంకటేశ్వరావు అన్నారు. నూజెండ్ల మండల పరిషత్ కార్యాలయం వద్ద సూపర్ జీఎస్టీ– సూపర్ సేవింగ్స్‌పై ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల అధికారులు, సచివాలయ సిబ్బందికి అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎంపీపీ మేడం జయరామిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమాదేవి, జెడ్పీటీసీ సభ్యులు జడ్డా సుబ్బులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఈలు యల్లమంద, అల్లాభక్షు, సొసైటీ అధ్యక్షులు బచ్చు అంజిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రసాదు

నాదెండ్ల: మండల పరిషత్ కార్యాలయంలో సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. సత్తెనపల్లి సర్కిల్ జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ కె సుజాత, ఈటీఏ సాంబశివరావు మాట్లాడారు. అనంతరం డిప్యూటీ ఎంపీడీవో టి వెంకటేశ్వర్లు కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యడ్లపాడు: జీఎస్టీ తగ్గిపు నిర్ణయంతో పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు చేకూరనుందని జిల్లా జీఎస్టీ కార్యాలయం ప్రతినిధి సాయిచరణ్ చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

టిడ్కో గృహాలను సద్వినియోగం చేసుకోవాలి

మున్సిపల్ చైర్మన్ రఫాని

చిలకలూరిపేట: టిడ్కో గృహ సముదాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. మున్సిపల్ కౌన్సిల్ హాలులో ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0, అంగీకార్–2025 కార్యక్రమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ ఖాళీ స్థలాలలో ఇళ్ల నిర్మాణానికి పీఎంఏవై పథకం కింద సహకారం అందజేయబడుతుందన్నారు. ఇప్పటికే నిర్మాణం పూర్తి అయిన టిడ్కో గృహాల్లోకి లబ్ధిదారులు చేరాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న గృహాలను కూడా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

చిరువ్యాపారులకు బ్యాంకు రుణాలు

మున్సిపల్ కౌన్సిల్ హాలులో జరిగిన లోన్స్ ఫర్ స్ట్రీట్ వెండర్స్ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్



అంగీకార్-2025 కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్

రఫాని మాట్లాడుతూ చిరువ్యాపారులు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తీసుకొని ఇబ్బందులు పడరాదని సూచించారు. తక్కువ వడ్డీకి అందిస్తున్న సబ్సిడీ రుణాలు బ్యాంకుల ద్వారా పొందవచ్చని వివరించారు. బ్యాంకులో రుణం పొంది సకాలంలో తిరిగి చెల్లిస్తే ఎక్కువ రుణం పొందేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. కమిషనర్ పి శ్రీహరిబాబు, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

రెండు లారీలు ఢీకొని డ్రైవర్‌కు గాయాలు

శావల్యాపురం: శావల్యాపురం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై రెండు లారీలు ఢీకొన్న సంఘటనలో డ్రైవరుకు గాయాలైన ఘటన ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్ఐ లేళ్ల లోకేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు నంద్యాల నుంచి విజయవాడకు పశువుల దాణా కట్టల లోడుతో బయలుదేరింది. కోల్‌కత్తా నుంచి నంద్యాల జిల్లా నందికొట్కూరు వైపు బొగ్గు లోడుతోబయలుదేరింది. శావల్యాపురం కొంకెరు వాగు సమీపాన రెండు లారీలు ఢీకొన్నాయి. ఘటనలో పశువుల దాణా లోడు లారీ డ్రైవరు రమేష్‌కు గాయాలయ్యాయి. అత్యవసన వైద్యసేవల కోసం వినుకొండలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిర్విరామ శ్రమయే విజయ రహస్యం



వినుకొండ: నిర్విరామంగా శ్రమిస్తే విజయం సొంతమవుతుందని స్థానిక కృష్ణవేణి డిగ్రీ కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పి.సీ తారాంబాబు అన్నారు. డీఎస్సీ 2025లో తమ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసుకొని టీచర్ ఉద్యోగాలు పొందిన రావిపాటి అంజలీదేవి, కంచర్ల శ్రీనివాసరావు, షేక్ కరీ మున్నిసాబేగం, ఎం.జ్యోతిలను శనివారం సత్కరించారు.

ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం ఆలోచించాలి

నరసరావుపేట: ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలపై ప్రభుత్వం ఆలోచించాలని ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు ఎస్.నాగమల్లేశ్వరావు అన్నారు. దివంగత ఉద్యోగ సంఘాల నేత తోట సుధాకర్ ప్రసాద్ వర్ధంతి సందర్భంగా శనివారం ఆర్‌డీఓ కార్యాలయ ఆవరణలోని రెవెన్యూ భవన్‌లో ఆయన చిత్రపటానికి వీఆర్‌ఓల జిల్లా అధ్యక్షులు రామారావుతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు.

వర్షాలకు దెబ్బతిన్న పంటల పరిశీలన



యడ్లపాడు: వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా పంట పొలాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి ఆర్ శ్రీలక్ష్మి రైతులకు సూచించారు. యడ్లపాడు గ్రామంలో నీట మునిగిన పలు పంటలను మండల వ్యవసాయ అధికారి ఎ హరిప్రసాద్‌తో కలిసి ఆమె శనివారం పరిశీలించారు. వ్యవసాయ అధికారులు ఉన్నారు.

సామాజిక బృందం తనిఖీలు

బొల్లాపల్లి: మండలంలోని గ్రామాల్లో సోషల్ ఆడిట్ బృందాల తనిఖీలు కొనసాగుతున్నాయి. 17వ విడత సామాజిక తనిఖీలకు చెందిన 13 బృందాలు తనిఖీలు చేపట్టాయని, ప్రస్తుతం పమిడిపాడు, గుట్లపల్లి, గరికపాడు, రావులాపురం, మన్నేపల్లి తండాల్లో పనులను తనిఖీ చేపట్టి గ్రామసభలు ముగించారని ఉపాధి హామీ పథకం ఏపీఓ ఎం లక్ష్మణరావు తెలిపారు. మిగిలిన పంచాయతీల్లో తనిఖీలు కొనసాగుతున్నాయని అన్నారు. 33 పంచాయతీల్లో ఏప్రిల్–1 2024 నుంచి మార్చి 31 2025 వరకు కూలీలు వేతనాలు, మెటీరియల్ కింద జరిగిన 771 పనులకుగాను రూ.15.56 కోట్ల మేర నిధులతో జరిగిన పనులను తనిఖీలు చేపట్టారని తెలిపారు.

సాగర్‌బాబు కుటుంబాన్ని ఆదుకోవాలి



వినుకొండ: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో వికలాంగుడైన కారంపూడి మండలం పెదకొదమగుండ్ల గ్రామపరిధిలోని కాకానివారిపాలెం గ్రామానికి చెందిన దళిత యువకుడు వర్ల సాగర్‌బాబు కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రజాసంఘాల నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ వర్ల సాగర్‌బాబు విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వలన విద్యుత్ షాక్‌కు గురై వికలాంగుడయ్యాడని, వెంటనే అధికారులపై చర్యలు తీసుకొని కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు వై.వెంకటేశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి, రామకృష్ణ, రెడ్డిబోయిన ప్రసన్నకుమార్, బూదాల శ్రీనివాసరావు, బొంకూరి వెంకటేశ్వర్లు, విజయ్, ఫిరోజ్‌ఖాన్, గనపర్తి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దసరా కానుకగా డీఏ ప్రకటించాలి

ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె కోటేశ్వరరావు

చిలకలూరిపేట: ఉపాధ్యాయులకు దసరా కానుకగా కరువు భత్యం (డీఏ) ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె కోటేశ్వరరావు, డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు కోరారు. ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో శనివారం సంఘ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికే నాలుగు డీఏలు ప్రకటించాల్సి ఉన్న నేపథ్యంలో కనీసం పండుగకు రెండు డీఏలైనా ప్రకటించాలని కోరారు. 12వ పీఆర్‌సీ కమిషనర్ నియామకం ఆలస్యం అవుతున్న నేపథ్యంలో 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో టెట్ పరీక్ష పాస్ కావాలనే నిబంధన విషయంలో ప్రభుత్వం చొరవ చూపి న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఎస్టీయూ ఏరియా కార్యదర్శి వినుకొండ అక్కయ్య అధ్యక్షత జరిగిన సమావేశంలో సంఘ నాయకులు ఎం కోటేశ్వరరావు, వి జయప్రకాశ్, షేక్ మగ్బుల్ బాషా పాల్గొన్నారు.